మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 115/ 16 గురువారం నవంబర్, 2023 పేజీలు: 4/వెల రూ5/-

## హమాస్-ఇజ్రాయిల్ మధ్య కుదిరిన డీల్!

**టెల్ అవీవ్, నవంబర్ 15(తెలంగాణ సమాజం):**

ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో కాల్పుల విరమణ జరగనుందా? అంటే అవుననే సంకేతాలు అందుతున్నాయి. హమాస్ ఇజ్రాయిల్ మధ్య డీల్ కుదిరినట్లు సమాచారం. కాల్పుల విరమణ కోసం అంగీకారం దిశగా రెండు వర్గాలు ముందడు గు వేశాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 70 మంది బందీలను విడిచిపెట్టేందుకు హమాస్ సిద్ధమైంది. అంతే సంఖ్యలో తమ జైల్లలో ఉన్న పాలస్తీనా మహిళలు, యువతను విడిచిపెట్టేందుకు ఇజ్రాయిల్ అంగీకరించింది. 5 రోజుల పాటు ఎలాంటి దాడులు చేయబోమని ఇజ్రాయెల్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గాజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటిం చాలని ప్రపంచ దేశాలు ఆకాంక్షించాయి. పాలస్తీనాకు మద్దతుగా ఇరాన్ సహా పశ్చిమాసియా దేశా లు మద్దతు తెలిపాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులను వెంటనే నిలిపివేయాలని హెచ్చరికలు కూడా చేశాయి. యుద్ధాన్ని సద్దుమణిగించేందుకు అమెరికా రంగంలోకి దిగింది. అధ్యక్షుడు బైడెన్ ఆయా దేశాలతో స్వయంగా చర్చలు జరిపారు. యుద్ధాన్ని నిలిపివేసి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఎట్టకేలకు ఇజ్రాయెల్-హమాస్ మధ్య ప్రస్తుతానికి ఒప్పందం కుదిరి నట్లు తెలుస్తోంది. జ్రాయెల్-హమాస్ మధ్య నెలరోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన హమాస్ రాకెట్ దాడులతో చెలరేగిపోయింది. హమాస్ దాడి నుంచి తేరుకుని ప్రతిదాడికి దిగిన ఇజ్రాయెల్.. హమాస్ అంతమే ధ్యేయంగా ముందుకు సాగింది. గాజాలో భూతల యుద్ధం చేసి కీలక హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఇన్నిరోజులుగా సాగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్ నుంచి దాదాపు 1400 మంది మరణించారు. గాజాలో 10,000వేలకు పైగా మరణాలు సంభవించాయి.



# ప్రతీకారం తీర్చాం.. ఫైనల్ చేరాం..

2 లో




## కెసిఆర్‌ను ఓడించడానికి కలసికట్టుగా రావాలి

- -గడీల పాలనపై తిరగబడ్డ ఘనత దీనిది
- -జనగామ మట్టికి పౌరుషం ఉంది
- -కెసిఆర్‌ను ఓడించడానికి కలసికట్టుగా రావాలి
- -జనగామ సభలో పిసిసి చీఫ్ రేవంత్ పిలుపు

2 లో



## బీజేపీకి విజయశాంతి రాజీనామా... త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరిక?

కొన్నిరోజులుగా బీజేపీపై అసంతృప్తితో ఉన్న విజయశాంతి

కిషన్ రెడ్డికి రాజీనామా లేఖను పంపించిన విజయశాంతి

రేపో.. ఎల్లుండో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం

విజయశాంతి భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. మరో పదిహేను రోజుల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ సమయంలో బీజేపీకి ఆమె భారీ షాకిచ్చారు. గత కొన్నిరోజులుగా ఆమె పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆమె పార్టీని వీడుతారనే చర్చ ఎప్పటి నుంచో సాగుతోంది. ఈ రోజు ఆమె బీజేపీకి రాజీనామా చేసి, ఆ లేఖను తెలంగాణ

మిగతా 2 లో



## వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో నెంబర్ వన్

-ఆరున్నర ఏళ్లు మాత్రమే బీఆర్ఎస్ పని చేసింది

-55 ఏళ్లు అవకాశం ఇస్తే కాంగ్రెస్ వాళ్ళు ఏం చేశారు?

-సెస్ వాళ్లను కరెంట్ కోసం బ్రతిమిలాడాం

-కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం పొలాల్లో ప్రతిరాత్రి జగరనే

-రాజన్న సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్


**రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సంక్రాంతికి గంగి రెద్దులు వచ్చినట్టు కాంగ్రెస్,

మిగతా 2 లో



## అమెరికాలో వేగంగా విస్తరిస్తున్న కొత్త కరోనా




2 లో

## బీజేపీ ప్రభుత్వం వైపే ప్రజల చూపు

### ఛతీస్‌గడ్, మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

**ఛతీస్‌గడ్,నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

ఛతీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ కూడా ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ కూడా తన స్టార్ క్యాంపెయినర్లతో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రెండు రాష్ట్రాల్లో నిర్వహించిన ర్యాలీలకు విశేషమైన ప్రజాదరణ లభించింది. ఆయన తన ఎన్నికల ప్రచార అనుభవాలను ట్విట్టర్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. ఛత్తీస్‌గడ్ ఎన్నికల ప్రచారం గురించి ప్రస్తావిస్తూ.. 'ఈసారి ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారంలో నా అనుభవాలు అద్భుతంగా, అపురూపంగా ఉన్నాయి. 'ఛత్తీస్‌గర్హియా - చాలా ఉత్తమమైనది'. కొత్త ఆశలు, కొత్త శక్తితో తమ రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా, ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఛత్తీస్‌గడ్ ప్రజలు ఎంతగానో కష్టపడుతున్నారు. ఛత్తీస్‌గడ్‌ను దుష్పరిపాలన, అవినీతి బారి నుంచి ఎవరైనా విముక్తం చేయగలిగితే అది బీజేపీ మాత్రమేనని వారికి తెలుసు. బీజేపీ చేసింది, బీజేపీ మాత్రమే అభివృద్ధి చేస్తుంది' అని ప్రధాని మోదీ అన్నారు. ఛత్తీస్‌గడ్ రానున్న కొద్ది సంవత్సరాల్లో 25 ఏళ్లు పూర్తి చేసుకోనుంది.



## ఇక ఎర్ర చందనం సాగు ఇక చట్టబద్ధం

**న్యూఢిల్లీ, నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**



అంతర్జాతీయ మార్కెట్లో ఎర్రచందనానికి ఉన్న డిమాండ్ ఎంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదనుకుంట. అత్యంత విలువైన ఎర్రచందనం సాగు చేయడం ఇప్పటి వరకు చట్టవిరుద్ధం ఎందుకంటే నిషేదిత జాబితాలో ఉండటమే కారణం. అయితే ఎర్రచం దనం సాగు, ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు తొలగించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ ప్రకటన చేశారు. ప్రభుత్వం ఎర్రచందనం సాగును సంక్లిష్ట వాణిజ్య పక్రియ నుంచి తొలగించినట్లు చెప్పారు. సాగు చేసి, ఎగుమతి చేసుకోవచ్చని..అంతేగాకుండా సాగుకు ప్రోత్సహాలు కూడా ఇస్తామని తెలిపారు. ఇటీవల స్విట్జర్లాండ్ లోని జెనీవాలో జరిగిన కన్వెన్షన్ ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఎర్రచందనం ఎక్కువగా ఆంధప్రదేశ్ లోని రాయలసీమలోని శేషాచలం అడవి ప్రాంతంలో దొరుకుతుంది. చిత్తూరు,నెల్లూరు,కడప ,కర్నూలు జిల్లాలోని శేషా చలం, వెలుగొండ, పాలకొండ, నల్లమల అడవులు తూర్పుకనుమల్లో వరకు విస్తరించి ఉన్నాయి. ఎక్కువగా శేషాచలం, వెలుగొండల్లో మాత్రమే ఎర్రచందనం అధికంగా పెరుగుతుంది. ఇక్కడ పెరిగే ఎర్రచందనానికి ఔదగుణాలతో పాటు మంచి రంగు నాణ్యత ఉంటుంది.

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

# కరెంట్ పై అర్థసత్యాలు !

కరెంట్ కావాలా ..కాంగ్రెస్ కావాలా అంటూ బిఆర్ఎస్ నేతు ప్రచారంలో ఎదురుదాడితో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ వస్తే అంధకారంలోకి వెళతామన్న భయాలు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే తెలంగాణ ఆగం అవుతుందన్న భయాలను రెచ్చగొడుతున్నారు. మొత్తంగా కాంగ్రెస్ భయం బిఆర్ఎస్‌ను వెన్నాడుతోంది. కరెంట్‌తో ప్రజల జీవితాలను మార్చామని చెబుతున్నారు. అయితే కరెంట్ కొనుగోళ్లపై మాత్రం మాట్లాడడం లేదు. ఎంత రేటుకు కొంటున్నారన్న వివరాలు ఇవ్వడం లేదు. దీంతో సహజంగానే అనుమానాలు వస్తున్నారు. దీనికితోడు కరెంట్ కావాలంటే బిఆర్ఎస్ అంటూ.. ఎన్నికల ప్రచారంలో ఊదరగొడుతున్నారు. రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ చాలంటున్నారంటూ..ప్రజలను మోసం చేసే పనిలో ఉన్నారు. ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. సిఎం కెసిఆర్ సైతం ఇదే అంశాన్ని ప్రధానంగా ఎత్తి చూపుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ విసిరిన సవాళ్లను పక్కన పెట్టి ఆత్మరోణలో పడ్డారు. నిజంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నామని ఎక్కడా గట్టిగా చెప్పలేకపోతున్నారు. సబ్ స్టేషన్ల వారీగా లెక్కలు చెప్పాలన్న డిమాండ్÷–కు అధికార బిఆర్ఎస్ నుంచి సమాధానం లేదు. ఉచిత విద్యుత్ పేరుతో జరుగుతున్న దోపిడీని కాంగ్రెస్ ముఖ్యంగా రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. దీనిని ఎవరు కూడా ప్రశ్నించడం లేదు. అందుకే రేవంత్ రెడ్డి కూడా ఎదురుదాడికి దిగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబం ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయని హెచ్చరిస్తున్నారు. లక్షలకోట్ల అవినీతిని కక్కిస్తామని, భూదోపిడీని బట్టబయలు చేస్తామని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ..కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఫ్యామిలీ కేటీఆర్, హరీష్ రావు, కవిత, సంతోష్‌ల కరెంట్ ఊడగొడుతం అన్నారు. కరెంట్‌కు కరెంట్‌తోనే సమాధానం చెప్పేలా రేవంత్ ప్రసంగాలు, ప్రచారాలు సాగుతున్నాయి. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు దిగమింగాడు. వెయ్యి ఎకరాల ఫార్మ్ హౌస్ కట్టుకున్నావని అంటూ రేవంత్ విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో పది ఎకరాల గడీని కట్టుకున్నాడు. ఇంటికో ఉద్యోగం అని ప్రజలను మోసం చేసి తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నాడు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు నెల ప్రారంభంలో జీతం ఇచ్చాము. 20వ తేదీ వచ్చినా జీతాలు ఇయ్యలేని దుస్థితికి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి తెచ్చాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత, ఎర్రబెల్లి దయాకర్‌రావు కరెంట్ తీసేస్తా. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే దొర దగ్గర బానిసలుగా పడిఉంటారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మీకోసం ప్రశ్నిస్తారు. హామీ ఇచ్చి తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. 6 గ్యారెంటీలు ఇప్పుడు హామీ ఇస్తున్నాం, వచ్చే నెలలో అమలు చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ఆషామాషీ ఎన్నికలు కాదని, ఆత్మ బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ ఎవడిపాలైంది, ఇప్పుడు ఎవడేలుతున్నడు అని ప్రశ్నించారు. నిజానికి కాంగ్రెస్ సంధిస్తున్న ప్రశ్నలకు బిఆర్ఎస్ వద్ద సమాధానం లేదు. కరెట్ పూర్తిగా ఇస్తున్నామని ఖచ్చితంగా చెప్పడం లేదు. నిరుద్యోగుల విషయంలో మోసం చేసింది. ధరణి పేరుతో రైతులను మోసం చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు (పనులు పూర్తి కాకముందే మేడిగడ్డ కుంగింది, అన్నారం పగిలింది.. సుందిదిళ్లకు దిక్కులేదు. లక్ష కోట్లు దిగమింగి పేక మేడలు కట్టిండన్న విమర్శలకు సమాధానం లేదు. స్వేచ్ఛ, సమానత్వం, సమాన అభివృద్ధి కోసం తెలంగాణ తెచ్చుకున్నం. త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ దొర కాళ్ల కింద నలిగిపోతోందని ఆవేదన సర్వత్రా ఉంది. ధనిక రాష్ట్రంలో ప్రతీనెలా మొదటి తారీఖు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉంది. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కేసీఆర్ అంటుండు..ఈ ఎన్నికలు దొరలకు ప్రజలకు మధ్య జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది. ఇకపోతే కేసీఆర్ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బీఆరెస్ ఆరుగురు మహిళలకు టికెట్లు ఇస్తే.. కాంగ్రెస్ 12 మంది మహిళలకు టికెట్లు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని, లేకపోతే 30లక్షల మంది నిరుద్యోగ యువకులు అడవి బాట పట్టే పరిస్థితి వస్తుందని పిపిసి చీఫ్ రేవంత్ రెడ్డి హెచ్చరించారు. నిరుద్యోగ యువతి ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుంటే.. కేసీఆర్ ప్రభుత్వం ఆ కుటుంబం పరువును బజారుకీడ్చిందన్నారు. ఎలా ఆమె కేసును అభాసుపాలు చేశారో మనమంతా చూశామన్నారు. శిశుపాలుడి వంద తప్పులు పూర్తయ్యాక శిరచ్ఛేదనం జరిగింది. పాపాల భైరవుడు కేసీఆర్ వంద తప్పులు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో శిరచ్ఛేదనం జరగాల్సిందే.. బీఆర్ఎస్ ప్రభుత్వం నేల కూలాల్సిందేనని అన్నారు. పదేళ్లలో ప్రజలకు కేసీఆర్ చేసిందేం లేదు. తన కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చుకుండు.. సర్పంచులు బిల్లులు రాక ఆత్మహత్య చేసుకుంటుంటే.. పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో ఆడబిడ్డలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి కేసీఆర్ పాలనలో దాపురించింది. మొత్తంగా ఎన్నికల వేళ కెసిఆర్ తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎదురుదాడితో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పేస్థితిలో అధికార పార్టీ లేదని తేలిపోయింది. దీనిని బట్టే బిఆర్ఎస్ చిత్తశుద్ధి ఏపాటితో అర్థం చేసుకోవచ్చు.

# ఓడించడానికి కలసికట్టుగా రావాలి

మొదటిపేజీ తరువాయి

**-గడీల పాలనపై తిరగబడ్డ ఘనత దీనిది -కెసిఆర్‌ను ఓడించడానికి కలసికట్టుగా రావాలి**

**-జనగామ సభలో పిసిసి చీఫ్ రేవంత్ పిలుపు**

**జనగామ,నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

జనగామ మట్టికి పౌరుషం ఉందని, గడీల పాలనపై తిరగబడ్డ ఘనత దీనిదిని పిసిసి రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్‌ను ఓడించడానికి కలసికట్టుగా రావాలని జనగామ సభలో పిసిసి చీఫ్ రేవంత్ పిలుపునిచ్చారు.కేసీఆర్ పంచన మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య చేరితే ఆయన గౌరవం ఏమైనా మిగిలిందా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించిన నేత పొన్నాలని అన్నారు. చివరు తిట్టిన కెసిఆర్ పంచన చేరడం ఆయనకేమీ మర్యాదో చెప్పాలన్నారు. బుధవారం నాడు జనగామలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడతూ..ఈ జన సందోహాన్ని చూస్తుంటే కాలనాగుల పని పట్టడానికి పుట్టలోనుంచి చీమలు బయటకు వచ్చినట్లుంది. జనగామలో పల్లా రాజేశ్వరరెడ్డిని ఓడించి బొంద పెట్టడానికి వచ్చిన మీకు అభినందనలు. పొన్నాల లేదని ఇక్కడ ఇబ్బంది జరుగుతదేమో అనుకున్నా...కానీ మిమ్మల్ని చూశాక నాకు ధైర్యం వచ్చింది. కన్నతల్లి లాంటి పార్టీని, కార్యకర్తలను మోసం చేసినవారికి బండకేసి కొడతామని నిరూపించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి గురించి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అర్ధనగ్న ప్రదర్శన చేసి చెప్పిండు. వీళ్లిద్దరి బాగోతం గడీలో ఉన్న దొరకు తెలుసని రేవంత్‌రెడ్డి ఎద్దేవ చేశారు. ఈ ప్రాంతంలో మట్టికి ఒక పౌరుషం ఉంది. దొరల రాజ్యంపై పోరాటం చేసి ప్రజల పక్షాన నిలిచిన చరిత్ర ఈ ప్రాంతానిది. కష్టాల్లో ఉన్న కార్యకర్తలను మోసం చేసి పొన్నాల శత్రువు పంచన చేరాడు. అమెరికాలో మాట్లాడుకుని కేసీఆర్ పంచన చేరాడు. జనగామ ప్రజలు లక్ష కోట్లు దోచుకున్న దొంగ వైపు ఉంటారో ధర్మం వైపు ఉంటారో తేల్చుకోండి. ప్రజా ప్రభుత్వంలో పేదలను ఆదుకునేందుకు సోనియమ్మ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాహిళలకు ప్రతీ నెల రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు ప్రతీ ఏటా ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు ప్రతీ ఏటా రూ.12వేలు, ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేస్తాం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రగతి భవన్ లోకి కాంట్రాక్టర్లకు తప్ప ఎవరికీ ప్రవేశం లేదు. ప్రజలకు ప్రవేశం లేని ప్రగతి భవన్ ఉంటే ఏంది లేకుంటే ఏంది? కేసీఆర్ ఉంటే మీకు వచ్చే పెన్షన్ రూ.2వేలు.. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడగొడితే రూ.4వేలు వస్తాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేయూత పథకం ద్వారా నెలకు రూ.4వేలు పెన్షన్ అందిస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.





# ప్రతీకారం తీర్చాం.. ఫైనల్ చేరాం..

మొదటిపేజీ తరువాయి

నాలుగేండ్ల నాటి పగ చల్లారింది. భారత క్రికెట్ అభిమానులను ఇప్పటికీ వేధించే 2019 వన్డే వరల్డ్ కప్ సెమీస్ ఓటమి, 2021 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఓటములకు భారత్ బదులు తీర్చుకుంది. ఐసీసీ టోర్నీలలో సెమీస్ గండాన్ని దాటలేక చతికిలపడుతున్న భారత్.. ఎట్టకేలకు ఆ ముప్పు తప్పించుకుంది. ముంబైలోని వాంఖడే వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో మొదట బ్యాటింగ్ చేసి భారీ స్కోరు చేసినా కివీస్ పోరాటంతో ఒకదశలో 'ఇంత స్కోరు చేసినా గెలుస్తామా..?' అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 398 పరుగుల ఛేదనలో కివీస్ తుదికంటా పోరాడి ఓడింది. ఛేదనలో ఆ జట్టు.. 48.5 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌట్ అయింది. ఫలితంగా భారత్.. 70 పరుగుల తేడాతో ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. కివీస్ బ్యాటర్లలో డారెల్ మిచెల్ (119 బంతుల్లో 134, 9 ఫోర్లు, 7 సిక్సర్లు), కేన్ విలియమ్సన్ (73 బంతుల్లో 69, 9 ఫోర్లు, 1 సిక్సర్) అద్భుతంగా పోరాడారు. భారత బౌలర్లలో షమీ ఏడు వికెట్లతో చెలరేగి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.భారీ ఛేదనలో కివీస్‌కు ఆరంభంలోనే షమీ డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. డెవాన్ కాన్వే (15 బంతుల్లో 13, 3 ఫోర్లు), రచిన్ రవీంద్ర (22 బంతుల్లో 13, 3 ఫోర్లు)లను షమీ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపాడు. 30 పరుగులకే ఆ జట్టు ఓపెనర్లను కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ కేన్ విలియమ్సన్, డారెల్ మిచెల్ లు కివీస్‌ను ఆదుకున్నారు.

## మిచెల్ – కేన్ కీలక భాగస్వామ్యం..

ఓపెనర్లు వెంటవెంటనే నిష్క్రమించినా కివీస్ ఈ మ్యాచ్‌లో ఇక్కడిదాకా వచ్చిందంటే అది మిచెల్ %--% విలియమ్సన్‌ల పోరాటమే. ఈ ఇద్దరూ క్రీజులో కుదురుకునేదాకా కాస్త ఓపికగా ఆడినా తర్వాత పుంజుకున్నారు. ఒకరిని మించి ఒకరు బౌండరీలతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీళ్లిద్దరి జోరుకు భారత స్పిన్ ద్వయం రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్ తేలిపోయారు. వికెట్ల కోసం ఎంత ప్రయత్నించినా భారత బౌలర్లకు నిరాశే మిగిలింది. 49 బంతుల్లో మిచెల్ అర్థ సెంచరీ పూర్తవగా 58 బంతుల్లో కేన్ మామ హాఫ్ సెంచరీ పూర్తయింది. అర్థ సెంచరీల తర్వాత ఈ ఇద్దరూ గేర్ మార్చారు. ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డ మిచెల్.. 85 బంతుల్లోనే సెంచరీ చేశాడు. బుమ్రా వేసిన 29వ ఓవర్లో ఐదో బంతికి షమీ.. విలియమ్సన్ క్యాచ్ మిస్ చేయడంతో కేన్ మామ బతికిపోయాడు.

## మళ్లీ పోటీలోకి తెచ్చిన షమీ..

ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ జోడీని డ్రింక్స్ బ్రేక్ తర్వాత షమీ విడదీశాడు. షమీ వేసిన 33వ ఓవర్లో రెండో బంతికి భారీ షాట్ ఆడబోయిన కేన్ మామ.. సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చాడు. అదే ఓవర్లో నాలుగో బంతికి టామ్ లాథమ్ కూడా వికెట్ల ముందు దొరికిపోయాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో ఈ మ్యాచ్‌లో భారత్ మళ్లీ పోటీలోకి వచ్చింది.

## మిచెల్ పోరాడినా..

వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో కివీస్ కథ ముగిసినట్టే అనిపించినా మిచెల్ పోరాటాన్ని వీడలేదు. లాథమ్ స్థానంలో వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (33 బంతుల్లో 41, 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి భారత్‌ను భయపెట్టాడు. ఈ ఇద్దరూ 61 బంతుల్లో 75 పరుగులు జతచేశారు. సిరాజ్‌ను లక్ష్యంగా చేసుకున్న ఈ జోడీ లక్ష్యాన్ని కరిగించి భారత్‌ను చికాకుపెట్టింది. సిరాజ్ వేసిన 39వ ఓవర్లో 12 పరుగులు రాగా 41వ ఓవర్లో ఫిలిప్స్.. రెండు సిక్సర్లు ఒక ఫోర్ బాది 20 పరుగులు పిండుకున్నాడు. కానీ బుమ్రా ఈ జోడీని విడదీశాడు. అతడువేసిన 43వ ఓవర్లో ఐదో బంతికి ఫిలిప్స్ భారీ షాట్ ఆడబోయి లాంగాఫ్‌లో జడ్డూ క్యాచ్ పట్టడంతో నిష్క్రమించాడు. ఆ తర్వాత వచ్చిన మార్క్ చాప్‌మన్ (2)ను కుల్‌దీప్ బోల్తా కొట్టించాడు. సహచర ఆటగాళ్లు ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్న క్రమంలో ఒత్తిడికి లోనైన మిచెల్.. షమీ వేసిన 46వ ఓవర్లో జడేజాకు క్యాచ్ ఇవ్వడంతో అతడి పోరాటం ముగిసింది. ఈ మ్యాచ్‌లో షమీకి ఇది ఐదో వికెట్.. మిచెల్ నిష్క్రమణతో కివీస్ పోరాటం ముగిసింది. ఆ తర్వాత లోయరార్డర్ చేసిన పరుగులు కివీస్ ఓటమి అంతరాన్ని తగ్గించాయే తప్ప విజయం దిశగా సాగలేదు. ఈ విజయంతో భారత్.. వరల్డ్ కప్ %--% 2023 ఫైనల్‌లో ప్రవేశించింది. గురువారం కోల్‌కతా వేదికగా సౌతాఫ్రికా %--% ఆసీస్‌మధ్య జరుగబోయే మ్యాచ్ విజేతతో ఈనెల 19న తుదిపోరులో అమీతుమీ తేల్చుకుంటుంది.

మొదటిపేజీ తరువాయి

# అమెరికాలో వేగంగా విస్తరిస్తున్న కొత్త కరోనా

**వాషింగ్టన్, నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి అమెరి కాలో మరోసారి వేగంగా విస్తరిస్తోంది. అత్యంత ప్రమాదకరమైన కరోనా వైరస్ కొత్త వేరియంట్ హెచ్‌వీ.1 అమెరికన్లను భయపెడుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నుండి వచ్చిన డేటా ప్రకారం అక్టోబర్ 28తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో కొత్తగా నిర్ధారణ అయిన కేసుల్లో 25.2 శాతం ఈ వేరియంట్ కారణమని తేల్చింది. గతంలో ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరించిన ఈజీ.5 అకా ఎరిస్ వేరియంట్ల కంటే ఈ హెచ్‌వీ.1 వేరియంట్ ఎక్కువ డామి నెంట్ వేరియంట్ అని, ఇటీవల నమోదైన కేసుల్లో నాలుగో వంతు కంటే మించి హెచ్‌వీ.1 వేరియం ట్ కేసులేనని గుర్తించారు. అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తాజా గణాంకాల ప్రకారం జూలైలో 0.5 శాతంగా ఉన్న ఈ వేరియంట్ కేసులు సెప్టెంబర్ నాటికి అవి 12.5 శాతానికి పెరిగాయి. దీన్ని ఒమిక్రాన్ గ్రాండ్ చైల్డ్‌గా వాండర్‌బిల్ట్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్‌లోని ఇన్ఫెక్షి యస్ డిసీజెస్ ప్రొఫెసర్ డా. విలియం షాఫ్నర్ పేర్కొన్నారు. అలాగే పిలోరా జేఎన్.1 వేరియంట్‌ను ఐస్‌లాండ్, పోర్చుగల్, స్పెయిన్‌తో సహా 12 దేశాలలో కనుగొన్నారు. ఈ వేరియంట్ సోకిన వారిలో గొంతు నొప్పి, జలుబు, దగ్గు, తలనొప్పి, అలసట, కండరాల నొప్పి, చలి లాంటివి కోవిడ్‌లో కీలక లక్షణాలు. అయితే, ఈ కొత్త వేరియంట్ సోకిన వారి నోటిలో కోవిడ్ టంగ్ లక్షణం కనిపిస్తోందని ఆరోగ్య నిపుణుల అభిప్రాయాన్ని ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. దీని ప్రకారం ఒమిక్రాన్ హెచ్‌వీ.1, పిరోలా జాతి జేఎన్.1 వేరియంట్స్ బారిన పడిన వారిలో నాలుక వాపు లేదా మంట ముఖ్య లక్షణంగా ఉంటోంది. కొంతమంది రోగుల నాలుకపై సా ధారణం కంటే తెల్లని మందపాటి పొర ఏర్పడుతోంది. దీంతోపాటు నాలుక బాగా ఎర్రగా మారడం, మంట, రుచి కోల్పోవడం, కొద్దిగా తిమ్మిరి కనిపించాయట. కొన్నిసార్లు నాలుకపై గడ్డలు , అల్సర్లు ఏర్పడినట్టు తాజా రిపోర్టుల ద్వారా తెలుస్తోంది. అయిదే మన శరీరంలోని ఇమ్యూన్ సిస్టం వైరస్‌తో పోరాడుతున్నదానికి సంకేతం కావచ్చని, కొంతమందికి, కొన్ని రోజుల తర్వాత వాపు దానంతట అ దే తగ్గిపోతుందని తెలిపారు. మరికొంతమందికి మందులు వాడాల్సి ఉంటుందన్నారు. ఈ నేప థ్యంలో ఇలాంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుణిని సంప్రదించాలని చెప్పారు. వేరియంట్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ, శాస్త్రవేత్తలు హెచ్‌వీ.1 లాంటి వేరియంట్ కొత్త వేరియంట్‌ల గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదని ఎన్‌బీసీ న్యూస్ రిపోర్ట్ చేసింది. ఎక్కువ మ్యుటేషన్ అయ్యే వేరియంట్లు తక్కువ హాని కలిగిస్తాయని వీరు పేర్కొన్నారు.



# వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో నెంబర్ వన్

మొదటిపేజీ తరువాయి

బీజేపీ వాళ్ళు ఓట్ల కోసం వస్తారన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మాత్రమే పోటీ, వ్యక్తుల మధ్య పోటీ కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆరున్నర ఏళ్లు మాత్రమే బీఆర్ఎస్ పని చేసిందని, తెలంగాణ రాక ముందు 55 ఏళ్లు అవకాశం ఇస్తే కాంగ్రెస్ వాళ్ళు ఏం చేశారని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. సెస్ వాళ్ళను కరెంట్ కోసం బ్రతిమిలాడమని, కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం పొలాల వద్ద ప్రతి రాత్రి జగరనేనన్నారు మంత్రి కేటీఆర్. అంతేకాకుండా.. 'కాంగ్రెస్‌కి అలాంటి దరిద్రులు మళ్ళ కావాలి. రేవంత్ రెడ్డి అన్నారు 24 గంటల కరెంట్ వద్దు అని. కాంగ్రెస్ వాళ్లకు ఎవుసం పై ఏం తెల్వదు. కరెంట్ కావాలా, కాంగ్రెస్ కావాలా ఆలోచన చేయండి. కాంగ్రెస్ హయాంలో తాగునీరు కోసం ఇబ్బంది పడ్డాం. కరెంట్ వచ్చే, రైతు బంధు, అసరా పెన్సన్ వచ్చే. ఊళ్లోల్లు అలుగుడు గులుగుడు ఉంటుంది. బీడీ చుట్టే మహిళలను అనాడు కాంగ్రెస్ వాడు దేకినొడు ఉన్నాడా. కాంగ్రెస్ వాళ్ళు లంగలు. రేవంత్ రెడ్డి ఎప్పుడు జైలుకు పోతాడో తెలియదు. నేను మీ కులపొడిని, మూడు సార్లు ఒడి పోయిన అంటూ ఏడుస్తారు నమ్మవద్దు, భీష్ముడు మంచివాడే కానీ కౌరవులతో ఉంటే ఒడి పోతాడు, ఇక్కడే కూడ గట్లనే ఉంది. అనాడు సర్కార్ దవాఖానా పోలేని వారు, నేడు సర్కార్ దవాఖానా నే పోతం అంటున్నారు. కుక్కలకు కొట్టినట్టి, కాంగ్రెస్ వాళ్ళను ముసలి వారు కొట్టెటట్టు ఉన్నారు. చందిర్తి లో గోదావరి నీళ్ళు తెచ్చాం. వరి ధాన్యం ఉత్పత్తి లో తెలంగాణ దేశం లో నెంబర్ వన్. కేసీఆర్ ను మూడవ సారి ముఖ్యమంత్రి చేయాలి. కేసీఆర్ గొంతు నొక్కడానికి కాంగ్రెస్, బీజేపీ పెద్దలు కుట్రలు చేస్తున్నారు, తెలంగాణ గొంతు కేసీఆర్. కులం, ప్రాంతం ఫీలింగ్ చూపించవద్దు.' అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# బీజేపీకి విజయశాంతి రాజీనామా...

మొదటిపేజీ తరువాయి

## త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరిక?

బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపించారు. రేపో ఎల్లుండో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. విజయశాంతి త్వరలో తమ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఇటీవల అన్నారు. బండి సంజయ్‌ని అధ్యక్ష పదవి నుంచి తొలగించినప్పటి నుంచి ఆమె పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఇటీవల పరేడ్ మైదానంలో జరిగిన... నరేంద్ర మోదీ పాల్గొన్న మాదిగల విశ్వరూప సభకు హాజరు కాలేదు. నిన్న ఫేస్ బుక్, ఎక్స్ ప్రొఫైల్ పిక్ మార్చారు. ఈ రోజు రాత్రి ఆంధ్రా ప్రజలు ఓకే కానీ, ఆంధ్రా పార్టీలను ప్రజలు నమ్మరని ట్వీట్ చేయడం గమనార్హం

మరో ఉదయం

# కెసిఆర్ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా మోసం

## కాంగ్రెస్ పార్టీ తోనే మైనారిటీలకు సరైన న్యాయం దక్కుతుంది,

## ఎం. ఏ సత్తార్ చేవెళ్ల పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు

**మొయినాబాద్:నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గాని ముస్లిం మైనారిటీలకు సరైన న్యాయం దక్కదని చేవెళ్ల పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం. ఎ సత్తార్ అన్నారు . వార్త ప్రతినిధి తో ఆయన మాట్లాడుతూ దేశంలో మైనార్టీలకు అండగా నిలిచేది మైనారిటీలకు సరైన న్యాయం దక్కాలంటే అది కాంగ్రెస్ పార్టీ అధికారం చూస్తేనే జరుగుతుందని ఆయన అన్నారు వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు అంతా కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు, టిఆర్ఎస్ పార్టీ మొదటగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ మైనార్టీలను మోసం చేశారని గుర్తు చేశారు మైనార్టీలకు ఇచ్చినటువంటి హామీ 12 శాతం రిజర్వేషన్ మొదట ప్రభుత్వం ఏర్పడగానే ఇస్తామని హామీ ఇచ్చి అది మరిచిపోయి రంజాన్ కు సంతలో దొరికే బట్టలు తెచ్చి పండుగ కానుకగా ఇచ్చానంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. నాడు ఇందిరాగాంధీ నుండి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు కుల మతాలకతీతంగా ప్రజాస్వామ్య పరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. మైనార్టీల్లో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారని వారి కావాల్సినటువంటి కనీస నిత్యవసర సరుకులు వారు కొనలేని స్థితిలో ఉన్నారని వంట గ్యాస్ ధర ఆకాశాన్ని అంటిందని. గత పది సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డును కూడా పంపిణీ చేయని ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని గుర్తు చేశారు చేవెళ్ల నియోజకవర్గం లో పామెన భీమ్ భరత్ కాంగ్రెస్ అభ్యర్థికి మైనార్టీలు అంతా అండగా నిలవాలని భారీ మెజారిటీతో ఆయనను గెలిపించాలని మైనార్టీ సెల్ తరఫున పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం మైనార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు





# బిఆర్ఎస్ ఎమ్మెల్యే చేవెళ్ల ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీమ్ భరత్

**మొయినాబాద్ : నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

బిఆర్ఎస్ ఎమ్మెల్యే చేవెళ్ల ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీమ్ భరత్ అన్నారు.బుధవారం మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట గ్రామం లోని బిఆర్ఎస్ , బీజేపీ పార్టీకి చెందిన యువకులు 100 మంది యువకులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మరియు తోల్కట్ట గ్రామ మాజీ సర్పంచ్ మండల నాయకులు బొల్లి గిద్ద సత్యనారాయణ ఆధ్వర్యంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు ఈ సందర్భంగా యువకులను ఉద్దేశించి పామెన బీమ్ భరత్ మాట్లాడుతూ చేవెళ్ల ప్రజలను నమ్మి వెంటవెల్లి కాల యాదయ్య గెలుపు కోసం రెండు దపాలుగా అలుపెరుగక పనిచేసిన నాయకులను కార్యకర్తలను ఆయన చిన్నచూపు చూశారని ఆరోపించారు .బిజెపి పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బి ఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని రాష్ట్రాన్ని అమ్ముకుంటుంటే. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పబ్లిక్ సంస్థలను ప్రజల ఆస్తులను అప్పనంగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని ఆరోపించారు, టిఆర్ఎస్ బిజెపి పార్టీలో ఎన్ని రోజులు పనిచేసిన ప్రయోజనం లేదని కాంగ్రెస్ పార్టీలో



ప్రతి కార్యకర్తకు ఏదో ఒక రోజు ఉన్నత స్థానం లభిస్తుందని ఆ సమయం వచ్చినప్పుడు పార్టీ కష్టపడి పని చేసినటువంటి నాయకులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు కాంగ్రెస్ పార్టీలో ఈరోజు నా సమక్షంలో చేరిన తోల్కట్ట గ్రామ యువకులకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు. నమ్మిన కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ పోగొట్టుకోదని కాంగ్రెస్ పార్టీలో పని చేసిన పని చేయడానికి వచ్చిన ప్రతి ఒక్క యువకుడ్ని ఆయన కండువా వేసి ఆహ్వానించి చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో ఘనవిజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని గుర్తు చేశారు స్వచ్ఛందంగా నియోజకవర్గం నుండి ప్రతిరోజు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతూ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేస్తున్నటువంటి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ప్రతి గడపగడపకి 6 గ్యారంటీల పథకాలను తీసుకెళ్లాలని రేపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక ప్రతి గడపగడపకు ఇదే కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వెళ్లి ఆరు గ్యారంటీల పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా సైనికుల్లాగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మానేయ మండల సీనియర్ నాయకులు తోల్కట్ట మాజీ సర్పంచ్ బొల్లిగిద్ద సత్యనారాయణ నవీన్ గ్రామ యువకులు మండల పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

# కూకట్పల్లిని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

## ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

# ఓటు బ్రహ్మాండమైన వజ్రాయుధం



**కామారెడ్డి,నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

రాష్ట్రం గర్వపడేలా ఎల్లారెడ్డి, కామారెడ్డిలను అభివృద్ధి చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఎల్లారెడ్డి అభ్యర్థి జాజుల సురేందర్‌ను ఎన్నికల్లో ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మన దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిపోయింది. ప్రజాస్వామ్య పక్రియలో రావాల్సినటువంటి పరిణితి ఇంకా రాలేదు. ఏయే దేశాల్లో అయితే వచ్చిందో బ్రహ్మాండంగా దూసుకుపోతున్నయి. ఎలక్షన్లు చాలా వచ్చాయి.. పోయాయి. ఇది మామూలుగా జరిగే విషయమే. ఇంత కాకుండా రెండు విషయాలపై మీరు గట్టిగా నిర్ణయిస్తే చాలా మంచి జరిగే అవకాశం ఉంటుంది. ఎన్నికల్లో అభ్యర్థి గుణం, గణం మంచీచెడు, వ్యక్తిత్వంపై ఆలోచన చేయాల్సిందే. అంతకంటే ముఖ్యంగా పార్టీలు ముఖ్యం. ఇక్కడ ఏ ఎమ్మెల్యే గెలుస్తడో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుంది' అన్నారు. మీ దగ్గర ఉండే బ్రహ్మాండమైన ఒకే ఒక ఆయుధం. వజ్రాయుధంలాంటిది మీ ఓటు. ఆ ఓటు ఆషామాషీగా వేయడం కాకుండా గ్రామం, పెద్దలంతా కూర్చొని విచారించి రాయిందో రత్నమేందో గుర్తుపట్టి ఓటు వేసిన నాడు ప్రజలు గెలువడం ప్రారంభమవుతుంది. ప్రజలు గెలిచినప్పుడు నిజమైన ప్రజాస్వామిక పరిణితి అవుతుంది. మంచి ఫలితాలు వస్తయ్. దేశం బాగుపడుతుంది. గెలిచిన ప్రభుత్వాలు జవాబుదారీగా ఉంటయ్. నేను చెప్పిన నాలుగు మాటలను చర్చించాలి. నిజానిజాలు గుర్తించి ముందడుగు వేస్తే మంచి భవిష్యత్‌కు పునాది పడుతుంది' అని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం. ప్రజలకు అన్నిరకాల మేలు జరగడం కోసం. గులాబీ జెండా పుట్టిందే మీ కనుసన్నల్లోనే. గులాబీ జెండా పుట్టిన నాడు నా తమ్ముడు విఠల్‌రెడ్డి బ్రహ్మాండమైన పద్యం రాసిండు. ఆ పాట తెలంగాణ అంతా

మార్మోగింది. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నది. పార్టీల గురించి ఆలోచించాలన్నప్పుడు ఆ పార్టీల వైఖరి ఏంది ? ప్రజల గురించి ఏం ఆలోచిస్తరు ? రైతాంగం గురించి విధానం ఏముంది ? మైనారిటీల గురించి ఏం ఆలోచిస్తరు ? సమాజాన్ని ఐకమత్యంగా ఎలా తీసుకుపోతురు? అనే విషయాలపై దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకుంటే.. న్యాయం జరుగుతుంది. బీఆర్ఎస్ చరిత్ర మీ కండ్ల ముందే ఉన్నది. తెలంగాణ వచ్చిన నాడు మంచినీరు లేదు. సాగునీరు లేదు. కరెంటు లేదు. చాలా భయంకరమైన పరిస్థితి. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, రైతుల ఆకలిచావులు. బతుకలేక వలసపోయే పరిస్థితి ఉండేది' అన్నారు. బీఆర్‌రెడ్డి అనే ఆర్థికవేత్త బిహార్‌లో ఆయనను రప్పించుకొని.. అందరినీ కలుపుకొని మూడునాలుగు నెలలు కష్టపడ్డాం. మొదట సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇచ్చాం. పేదలను ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణ గ్రామాలు పచ్చగా ఉండాలి.. కళకళలాడాలి.. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే ఉద్దేశంతో పటిష్టమైన వ్యవసాయ స్థిరీకరణ కోసం ప్రణాళిక తయారు చేసుకున్నాం. మిషన్ కాకతీయ తీసుకువచ్చాం. సదాశివ్‌నగర్ చెరువులో నేను కూడా తట్టమోసిన. ఐటీరంగం, పారిశ్రామికరంగం ముందుకు తీసుకెళ్లాలని దానికి ప్రణాళికలు రూపొందించాం. రాష్ట్ర తలసరి ఆదాయంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాం. పంటలు పెరిగాయ్, పారిశ్రమలు పెరిగాయి. పెట్టుబడులు వస్తున్నయ్. ఐటీరంగం విస్తరించింది. ఐటీ ఉత్పత్తులు భారీగా పెరిగాయి. రాష్ట్రం వచ్చిన తర్వాత అన్ని ఒక్కొక్కటి చేసుకుంటూ వచ్చాం' అన్నారు. రాష్ట్రం వచ్చిన ఏడాదిన్నర లోపే 24గంటల కరెంటును అన్నిరంగాలకు ఇస్తున్నాం. దాని తర్వాత మంచినీళ్ల బాధను పోగొట్టుకున్నాం. అంతకుముందు ఎండకాలం వచ్చిందంటే సర్పంచులకు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు బిందెల ప్రదర్శన కనిపించేది. మారుమూల తండా, గూడేల్లోని ఇంటింకి నల్లా పెట్టి నీరిస్తున్నాం. ఆ తర్వాత సాగునీటి కోసం ప్రయత్నం చేశాం. ఆ ప్రయత్నంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి వెనుబడి ఉన్నది. అందుకే నేను కామారెడ్డికి వచ్చిన. కామారెడ్డిలో పోటీ చేస్తున్నంటే ఎల్లారెడ్డి వేరే కాదు. రెండింటికి కలిపి ఎమ్మెల్యేగా ఉన్నట్టే లెక్క. సురేందర్ నాకు తమ్ముడు లాంటోడు. కుటుంబ సభ్యుడిలాంటోడు. నాకు దగ్గరి వ్యక్తి. మొదటి నుంచి తెలంగాణ ఉద్యమంలో కష్టపడి చేసిన వ్యక్తి. ఎల్లారెడ్డిలో సురేందర్ ఎమ్మెల్యేగా ఉన్నా నేనే పని చేస్తా. ఇక్కడ అద్భుతమైన ఆవిష్కరణ జరుగుతుంది. బ్రహ్మాండమైన అభివృద్ధి చూడబోతున్నరు. ఇన్‌ఫ్రాస్టక్చర్, రోడ్లు ప్రతి విషయంలో తెలంగాణలోనే నెంబర్ వన్‌గా అయ్యింది ఎల్లారెడ్డి, మా కామారెడ్డి అని గర్వపడేలా చేస్తా'నన్నారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్.. ఆ పార్టీ అనాలోచిత నిర్ణయం వల్లే 58 ఏండ్లు గోస పడ్డామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

**కూకట్పల్లి, నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

బాలానగర్ డివిజన్,కుమ్మర బస్తీ,హనుమాన్ టెంపుల్ దగ్గర నుండి పాదయాత్రను ప్రారంభించిన బిజెపి బలపరిచిన జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ బాలానగర్ డివిజన్లో ఎన్నికల ప్రచారం లో భాగంగా హనుమాన్ టెంపుల్ లో ప్రత్యేక పూజలు చేసి అనంతరం కార్యకర్తల నడుమ పాదయాత్రను ప్రారంభించి గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్న బిజెపి బలపరిచిన జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్.

బాలానగర్ హనుమాన్ కామన్ నుండి బిజెపి శ్రేణులు, జనసైనికులు కలిసి పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందులోల బస్తీ, కుమ్మర బస్తి, సిక్కుల బస్తీ, దాసరి బస్తి, బాలానగర్ విలేజ్, రాజు కాలనీ,వినాయక నగర్,సాయి నగర్,కళ్యాణి నగర్,నవజీవన్ నగర్, ఫిరోజ్ గూడ వరకు పాదయాత్ర కొనసాగింది.ఆయన మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ గడిచిన 10 సంవత్సరాల నుంచి అభివృద్ధికి దూరంగా ఉందని, ఇక్కడ ప్రజలు ఎక్కువగా పేదవారు నివసిస్తారని,చిన్న చిన్న కంపెనీలలో ఉద్యోగం చేస్తూ జీవనం




సాగిస్తూ ఉంటారు. వారి ప్రధానమైన సమస్యలు నీటి సమస్య, వాటర్ సమస్య, డ్రైనేజీ సమస్యలు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ప్రధానంగా ఇళ్ల సమస్య, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి, మోసం చేసింది ఈ ప్రభుత్వం,ఇప్పుడు ఎన్నికలు వచ్చినాయి కాబట్టి ఏ మొఖం పెట్టుకుని మీ దగ్గరికి వచ్చి ఓటు అడుగుతారని అంటూ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈసారి ఆ తప్పు జరగకుండా బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మీ ముందుకు వచ్చి మిమ్మల్ని అడుగుతున్నాను.ఈసారి జనసేన, బిజెపిను బలపరచవలసిందిగా అలాగే మన ఎన్నికల గుర్తు గాజు గ్లాసు పై ఓటు వేసి నన్ను గెలిపించవలసిందిగా కోరుచున్నాను.ఈ కార్యక్రమంలో మాధవరం కాంతారావు,ఎ. సూర్య రావు, శంకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రమేష్, రాజేష్, నాగరాజు,సునీల్, రమేష్, శివరంజని,వాణి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పోలీసులతో అభ్యర్థులను బెదిరిస్తున్నారు

## నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్నారు

## తెలంగాణాకు బానిస బతుకులు, దోపిడి పాలన మిగిలింది

## రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలనపై అసహ్యం ఏర్పడింది

## నిరంకుశపాలనను ప్రజలు అంతమొందించాలనుకుంటున్నారు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



**హైదరాబాద్,నవంబర్15 (మరో ఉదయం న్యూస్)**

గడిచిన పదేళ్లలో తెలంగాణకు బానిస బతుకులు, దోపిడి పాలన మాత్రమే మిగిలిందని.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలనపై అసహ్యం ఏర్పడిందని.. ఈ నిరంకుశపాలనను ప్రజలు అంతమొందించాలని నిర్ణయించుకున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. పలుచోట్ల అభ్యర్థులను పోలీసులతో బెదిరించి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్నారని దుయ్యబట్టారు. గజ్వేల్‌లో కేసీఆర్‌పై 114 మంది ధరణి బాధితులు నామినేషన్లు వేశారని, కామారెడ్డిలో 58 మంది ధరణి బాధితులు నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. బీజేపీ తరఫున 39 మంది బీసీ అభ్యర్థులు బరిలో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 22 మంది బీసీలకు మాత్రమే టికెట్లు ఇచ్చిందని, బీఆర్ఎస్ 23 మంది బీసీలకు మాత్రమే టికెట్ ఇచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ మాత్రమే బీసీల గురించి ఆలోచిస్తోందన్నారు. రెండు జనరల్ స్థానాల్లో ఇద్దరు ఎస్సీలకు టికెట్లు ఇచ్చామన్నారు. గజ్వేల్‌లో ఈటల పోటీ చేస్తారని అనగానే కేసీఆర్ భయపడ్డారని ఎద్దేవా చేశారు. గజ్వేల్‌లో ఓడిపోతాననే భయంతో.. కేసీఆర్ కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. గజ్వేల్, కామారెడ్డి రెండు స్థానాల్లో కేసీఆర్ ఓడిపోతారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఓడిపోకూడదని.. రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని రంగంలోకి దింపారని ఆరోపించారు. తండ్రి, కొడుకులు.. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరు ఈ ఎన్నికల్లో ఓడిపోతారని జోస్యం చెప్పారు. తెలంగాణ తెచ్చుకుంది.. కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసేందుకు కాదన్నారు. కేసీఆర్ కూడా ప్రధానిగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రచార ప్రసంగాలలో పస లేదని.. బలవంతంగా ప్రజలను సభలకు తీసుకెళు తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం బీసీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ చెబుతున్నారని.. నరేంద్ర మోదీ పాలనకు భవిష్యత్తు లేదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అరు నెలలకో ఒక ముఖ్యమంత్రి అవుతారని.. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తే మూడు నెలలకు ఒక ప్రధాని మారుతారని ఎద్దేవా చేశారు.




### సంక్రాంతిబరిలో పలు సినిమాలు

# రెడీ అవుతున్న నా సామిరంగా

సంక్రాంతికి సినిమాల తాకిడి ఎక్కువ కావడంతో అసలు కొన్ని సినిమాలు నిజంగానే ఆ సమయానికి విడుదల అవుతాయా లేదా అనే అనుమానాలు ఎక్కువగానే వస్తున్నాయి. ఇక కొన్ని సినిమాల షూటింగ్స్ అయితే ఇంకా పూర్తి కాలేదు. ఆ పనులు కూడా సంక్రాంతి లోపు ఫినిష్ అవుతాయా లేదా అనే క్లారిటీ కూడా లేదు. సంక్రాంతి సీజన్ ను వదులు కోవడానికి మేకర్స్ వెనుకడుగు వేయడం లేదు. సంక్రాంతి సినిమాలలో ముందుగా షూటింగ్ ఫినిష్ చేసుకున్న సినిమాలలో సైంధవ్, ఈగల్, హనుమాన్ ఉన్నాయి. ఈ మూడు సినిమాలు అసలు పోటీ నుంచి తప్పుకోవడానికి ఏ మాత్రం ఇష్ట పడడం లేదు. ఇక గుంటూరు కారం, ఫ్యామిలీ స్టార్ సినిమాలు షూటింగ్ బ్యాలెన్ ఎక్కువగానే ఉంది. గుంటూరు కారం అయితే డిసెంబర్ సెకండ్ వీక్ నాటికి షూటింగ్ పూర్తి చేసుకునే విధంగా త్రివిక్రమ్ ప్లాన్ చేస్తున్నాడు. ఇక వేగంగా షూటింగ్ ఫినిష్ చేసుకుంటున్న సినిమాలలో నాగార్జున నా సామి రంగ మొదటి స్థానంలో ఉందని చెప్పవచ్చు. ఈ సినిమా సంక్రాంతిని టార్గెట్ గా పెట్టుకొని రిలీజ్ అవుతోంది. నాగార్జున సంక్రాంతి టైమ్ లో సోగ్గాడే చిన్న నాయన, బంగార్రాజు లాంటి సక్సెస్ లను అందుకున్నాడు. బిన్నీ దర్శకత్వంలో రూపొందుతున్న నా సామి రంగ పూర్తిగా మాస్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రానుంది. ఇక జనవరి 12న ఈ సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నారు. ఇక డిసెంబర్ అయిదుకు నాలుగు పాటలు మినహా మిగిలిన సినిమా అంతా పూర్తి అయ్యే విధంగా దర్శకుడు ఎ÷-లాన్ చేసుకుంటున్నాడు. ఈమధ్య కాలంలో ఏ సినిమా షూటింగ్ కూడా ఈ స్పీడ్ లో కొనసాగ లేదని చెప్పవచ్చు. ఇక సంక్రాంతి ఫెస్టివల్ లో ఈ సినిమాకు మాస్ కంటెంట్ తో పోటీగా కేవలం గుంటూరు కారం మాత్రమే ఉంది. మిగతా సినిమాల కంటెంట్ కాస్త భిన్నంగా ఉన్నాయి. ఇక నా సామి రంగ తప్పకుండా సంక్రాంతి టైమ్ లో క్లిక్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు.




# యానిమల్ ప్రమోషన్‌లో రణ్‌బీర్

## బాలయ్యతో అన్‌స్టాపబుల్ ఎపిసోడ్





బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ ప్రస్తుతం యానిమల్ సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్ ఫేం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో హిందీతోపాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. తాజాగా రణ్‌బీర్‌కపూర్, రష్మిక మందన్నా, సందీప్ రెడ్డి టీం అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే షోలో సందడి చేసింది. బాలకృష్ణతో హీరోహీరోయిన్లు ఇద్దరూ కలిసి డ్యాన్స్ కూడా చేశారు. రణ్‌బీర్ కపూర్ ఎంట్రీలోనే ఫ్లూటు జింక ముందు ఊదు, సింహం ముందు కాదు.. డైలాగ్ చెప్పగా సెట్స్ అంతా ప్రశంసలతో ముంచెత్తిందని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు రణ్‌బీర్‌కపూర్ తాత రాజ్‌కపూర్, తన తండ్రి ఎన్టీఆర్ గతంలో ఎలాంటి అనుబంధం కొనసాగించేవారో కూడా చెప్పాడట బాలకృష్ణ. ఈ స్పెషల్ ఎపిసోడ్ ఎప్పుడనే దానిపై ఆహా త్వరలోనే క్లారిటీ ఇవ్వనుంది. ఆహాలో స్ట్రీమింగ్ కాబోయే ఈ స్పెషల్ ఎపిసోడ్‌ను చాలా వినోదాత్మకంగా డిజైన్ చేసినట్టు ఇప్పటివరకు నెట్టింట వైరల్ అవుతున్న స్టిల్స్ చెబుతున్నాయి. యానిమల్ చిత్రంలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పవర్ ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామా, బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సూపర్ థ్రిల్ అందించేలా యానిమల్ ఉండబోతుందని ఇప్పటివరకు విడుదల చేసిన రషెస్ చెబుతున్నాయి. యానిమల్ చిత్రాన్ని భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృషన్ కుమార్, మురద్ ఖేతని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన నాన్న నువ్ నా ప్రాణం (ఔజీనినిజీఔబీలఔజీజీఖసజీనిజీప) లిరికల్ సాంగ్‌తోపాటు మిగిలిన రెండు పాటలకు మంచి స్పందన వస్తోంది. తండ్రీకొడుకులైన అనిల్ కపూర్-రణ్‌బీర్ కపూర్ మధ్య వచ్చే సన్నివేశాలతోఎమోషనల్ టచ్‌తో సాగుతున్న ఈ పాట అందరినీ భావోద్వేగానికి గురి చేస్తుందని విజువల్స్ చెబుతున్నాయి.

# వెబ్ సీరిస్ ధూతలో నాగచైతన్య ప్రమోషన్ కార్యక్రమాలతో బిజీ

అక్కినేని నాగేశ్వరరావు మనవడిగా.. నాగార్జున కొడుకుగా నట వారసత్వాన్ని సక్సెస్‌ఫుల్‌గా కొనసాగిస్తున్నాడు నాగచైతన్య. సినిమా సినిమాకు కొత్తదనంతో కూడిన కథలను ఎంచుకుంటూ యాక్టర్‌గా తనను తాను మరింత నిరూపించుకునేందుకు ఎప్పుడూ సిద్దంగా ఉండే హీరోల్లో టాప్‌లో ఉంటాడు చైతూ. ప్రస్తుతం నాగచైతన్య చందూమొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాతో బిజీగా ఉన్నాడు.తాజాగా నాగచైతన్య నుంచి రెండు అప్‌డేట్స్ ఇప్పుడు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. అవేంటంటే విక్రమ్ కే కుమార్ దర్శకత్వంలో నటించిన వెబ్ ప్రాజెక్టు ధూత. ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ధూత తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో డిసెంబర్ 1న స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీ అయిపోయాడు చైతూ.ప్రమోషన్స్‌లో భాగంగా నాగచైతన్య ముంబైలో ల్యాండ్ అయ్యాడు. ఇవాళ ముంబైలో జరుగబోయే ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ సెమ్మీ÷నైల్ మ్యాచ్‌లో సందడి చేయనున్నాడు చైతూ. స్టార్ స్పోర్ట్స్ తెలుగులో కలుద్దాం.. అంటూ ఓ వీడియోను షేర్ చేశాడు నాగచైతన్య . ముంబై ఎయిర్‌పోర్టులో నుంచి వస్తున్న విజువల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌లో పార్వతి తిరువొత్తు, ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఫిషర్‌మెన్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఔఅ23ని పాపులర్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై తెరకెక్కిస్తోంది.









# బాలీవుడ్‌లో మరో మల్టీస్టారర్ కరణ్,రణ్‌వీర్, షారూఖ్‌లతో మూవీ

బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్ తెరపైకి రానుంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తున్నది. అదీ కూడా 13 ఏండ్ల తర్వాత ఈ కలయిక జరగనుండడంతో అందరి దృష్టి ఇప్పుడు ఈ ప్రాజెక్టుపై పడింది. ఇంతకు విషయానికి వస్తే బాలీవుడ్ టాప్ డైరెక్టర్ కరణ్ జోహార్ షారుఖ్‌ఖాన్, రణవీర్ సింగ్ కాంబినేషన్‌లో ఓ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ రూపొందనున్నట్లు,త్వరలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. 1995లో దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే వంటి ఆల్‌టైమ్ హిట్ సినిమాతో ప్రారంభమైన కరణ్, షారుఖ్ కాంబినేషన్ 2010లో వచ్చిన మై నేమ్ ఇస్ ఖాన్ వరకు నిర్మాతలుగా, గెస్ట్ అప్పియరెన్స్, ప్రత్యేక పాత్రలు, కెమియోలు ఇలా మొత్తంగా 22 సినిమాలకు కలిసి పని చేశారు. అయితే వీటిలో అన్నీ ఫ్యామిలీ చిత్రాలు కావడమే కాక విజయాల శాతం కూడా ఎక్కువే. ఇటీవలే రణ్‌వీర్ సింగ్ అలియా భట్‌లతో రాఖీ ఔర్ రాణి కా ప్రేమ్ కహానీ సినిమాతో హిట్ కొట్టిన కరణ్ ఇప్పుడు ఈ చిత్రంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. అయితే తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం కరణ్ జోహార్ , షారుఖ్ ఖాన్ కాంబినేషన్‌లో ఈ చిత్రం వారి గత చిత్రాలకు భిన్నంగా ఔట్ అండ్ ఔట్ యాక్షన్‌తో మునుపెన్నడు సిల్వర్ స్క్రీన్‌పై రాని విధంగా తీయనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సంవత్సరం పఠాన్, జవాన్ వంటి యాక్షన్ సినిమాలతో మంచి ఊపు మీదున్న షారుఖ్‌తో మరోసారి అలాంటి తరహా చిత్రమే తీయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా ఇప్పటివరకు 10 సినిమాలకు పైగా దర్శకత్వం వహించిన కరణ్ జోహార్ అందులో యాక్షన్ జానర్‌లో ఒక సినిమా కూడా చేయకపోవడం విశేషం. ఈ క్రమంలో ప్రస్తుతం అంతటా యాక్షన్ చిత్రాల ట్రెండ్ నడుస్తుండడంతో కరణ్ కూడా ఆ వైపు టర్న్ తీసుకోని తనకు అచ్చొచ్చిన షారుఖ్ ఖాన్‌తో ఫుల్ లెంగ్త్ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాను తెరమీదకు తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్రలో మరో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ నటించనున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి.

# సుమంత్ చిత్రం మహేంద్రగరి వారాహి



రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ప్రొడక్షన్ నెంబర్ 2 చిత్రానికి టైటిల్ ఖరారు చేశారు. రాజశ్యామలా అమ్మవారి నిత్య ఉపాసకులు, విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి సమక్షంలో ఈ చిత్రానికి 'మహేంద్రగిరి వారాహి'అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు. ఈ మేరకు చిత్ర బృందం విశాఖ శారదాపీఠాన్ని సందర్శించింది. హీరో సుమంత్ , హీరోయిన్ మీనాక్షి, చిత్ర దర్శకుడు జాగర్లపూడి సంతోష్.. నిర్మాతలు కాలిపు మధు, ఎం సుబ్బారెడ్డి తదితరులు రాజశ్యామల అమ్మవారి ఆలయంలో పూజలు చేసి, పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిశారు. రాజశ్యామల అమ్మవారితో వారాహి అమ్మవారికి ఉన్న అనుబంధం గురించి చిత్ర బృందం స్వాత్మానందేంద్ర స్వామిని అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు జాగర్లపూడి సంతోష్ మాట్లాడుతూ.. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నాం. మహేంద్రగిరి వారాహి చిత్రానికి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకోవడానికి చిత్రబృందం కలిసి వచ్చాం. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిత్ర నిర్మాణం జరుగుతోంది.. రాజశ్యామల అమ్మవారు కొలువుదీరిన ఆలయం విశాఖ శారదాపీఠంలోనే ఉన్నందున అమ్మవారి అనుగ్రహం కోసం ఇక్కడకు వచ్చాం. ఈ ఏడాది జూన్ నెలలో షూటింగ్ ప్రారంభించాం, త్వరలో చిత్ర నిర్మాణం పూర్తవుతుంది. 'మహేంద్రగిరి వారాహి' చిత్ర ఇతివృత్తాన్ని స్వరూపానందేంద్ర స్వామికి వివరించి ఆశీస్సులు అందుకున్నామని అన్నారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com